వైభవంగా విగ్రహ ప్రతిష్ట


ప్రత్యేక అలంకరణలో పాలకొండ వెంకటేశ్వర స్వామి


విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తదితరులు

రాయచోటి టౌన్ (వీరబల్లె) : వీరబల్లె మండల పరిధిలోని సోమవరం గ్రామం పుత్తావాండ్లపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీ పాలకొండ వెంకటేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా ఏర్పాటు చేశారు. రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జున రెడ్డి, ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, రాష్ట్ర విద్యుత్ శాఖ మండలి చైర్మన్ నాగార్జునరెడ్డి, రాంప్రసాద్‌రెడ్డిలు ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయం ఎదురుగా ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. విగ్రహ ప్రతిష్ఠ తరువాత స్వామి వారికి కల్యాణ మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవానికి స్థానిక భక్తులు తరలి వచ్చారు.

అంతకు ముందుగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వీఆర్ వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాదాలు అందజేశారు. అనంతరం స్వామి వారిని దర్శించుకున్న ప్రముఖులకు స్వామి వారి తీర్థప్రసాదాలు పంచి పెట్టడంతో పాటు స్వామి చిత్రపటాలు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బయారెడ్డి, మాజీ పాత్రికేయుడు నాగిరెడ్డి, రత్నం, మహేశ్వరరాజు, నారాయణరెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొని స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు గాలివీటి వీరనాగిరెడ్డి, సర్పంచ్‌లు నేతి ఆంజనేయులు, ఈశ్వరయ్య, గోపీనాథరెడ్డి, రవి, సుండుపల్లె ఎంపీపీ స్థానిక నాయకులు కుళాయిరెడ్డి, ఈశ్వరరెడ్డి, రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నర్సుల సేవలు అభినందనీయం


రాయచోటి అర్బన్ : నర్సులను సన్మానిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు


రాజంపేట రూరల్: ర్యాలీ ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ చెన్నకృష్ణ


లక్కిరెడ్డిపల్లి: ఆసుపత్రిలో వైద్యులతో కలిసి కేక్‌ను కట్ చేస్తున్న నర్సులు

రాయచోటి అర్బన్ : మానవసేవే మాధవసేవగా భావిస్తూ నర్సులు రోగులకు సేవలందిస్తుండడం అభినందనీయమని రోటరీక్లబ్ అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ రెడ్డెన్న, అధ్యక్షురాలు అనసూయదేవి అన్నారు. ప్రపంచ నర్సుల దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నర్సుల దినోత్సవం నిర్వహించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌తో కలసి నర్సులకు శాలువ కప్పి సన్మానం చేశారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ కార్యదర్శి నరసింహారెడ్డి, సభ్యుడు మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట రూరల్: వ్యాధి గ్రస్తులకు నర్సులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎస్.చెన్నకృష్ణ కొనియాడారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలోని పీపీ యూనిట్‌లో అంతర్జాతీయ నర్సుల దినోత్సవంను డిప్యూటి డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ చెన్నకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ముందుగా వైద్యులతో కలిసి కేక్ కట్ చేసిన డాక్టర్ చెన్నకృష్ణ నర్సులకు కేక్‌ను పంచి అభినందనలు తెలియజేశారు. అనంతరం నర్సులు చేస్తున్న సేవలకు కృతజ్ఞతలు తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చెన్నకృష్ణ మాట్లాడుతూ కరోనా సమయంలో నర్సులు ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. రాష్ట్ర సీహెచ్‌ఓస్, పెన్షనర్స్ అసోసియేషన్ రాజంపేట అధ్యక్షులు పిల్లి పిచ్చయ్య మాట్లాడుతూ ఇంటింటికి ఆరోగ్య సర్వేలతో పాటు బాలింతలకు సేవ చేయడంలో నర్సులు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో వైద్యులు లక్ష్మీప్రసన్న, వికాస్, అశోక్, సౌజన్య, మస్తానీ, టీబీ సూపర్ వైజర్ పీ జయప్రకాష్, యుడీసీ ఎల్ సిద్ది రామయ్య, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గన్నారు.

లక్కిరెడ్డిపల్లి: రోగులపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి మెరుగైన వైద్య సేవలు అందించడంలో నర్సులదే కీలకపాత్ర అని అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్యలు పేర్కొన్నారు. నర్సుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యులతో కలిసి కేక్ కట్ చేసి ఆసుపత్రిలో నర్సులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ధరణీ, శ్రీనివాస్ రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అమీర్, సర్పంచ్‌లు వెంకటనారాయణరెడ్డి, జనార్దన్ రెడ్డి, ఉపసర్పంచ్ రాజారెడ్డి, లక్కిరెడ్డిపల్లె సొసైటీ డైరెక్టర్ సుబ్బరాజు, ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, ల్యాబ్ టెక్నీషియన్ ప్రసాద్ యాదవ్, ఆసుపత్రి సిబ్బంది రెడ్డి కృష్ణ, వైద్యులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

– ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి

నందలూరు(రాజంపేట): వైద్యం, విద్య పరంగా సేవలందించడంలో నందలూరు మండలం ముందంజలో ఉండాలని మండలాధ్యక్షుడు మేడా విజయభాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ సభాభవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలన్నారు. పది ఫలితాల్లో నందలూరు, నాగిరెడ్డిపల్లె జడ్పీహైస్కూలు వెనకబడ్డాయని ఆందోళన వ్యక్తంచేశారు. విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అటువంటప్పుడు విద్యాభివృద్ధికి కృషి చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. వచ్చే యేడాది అయినా మంచి మార్కులు వచ్చేలా టెస్ట్ తరగతులను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈవో గంగిరెడ్డికి తెలియచేశారు. గర్భవతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అంగన్వాడీలకు ఉందన్నారు. మండలంలో గర్భవతులు 259 మంది ఉన్నారన్నారు. వైఎస్సార్ దుల్హన్‌పథకం, కళ్యాణమస్తు పథకంలో మండలంలో 12 మందికి మంజూరైందన్నారు. వారికి మంజూరు పత్రాలను అందచేశామన్నారు. సమావేశంలో జడ్పీటీసీ గడికోట ఉషాసుబ్బారెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా సెక్రటరీ అమీర్, మండలకో–ఆప్షన్ సభ్యుడు కలీం, ఎంపీడీఓ సౌభాగ్య, డీటీ మోహన్, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లో ఊరెళుతున్నారా.. జాగ్రత్త!

- చోరీలు జరగకుండా ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను ఉపయోగించుకోండి
- ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్



ప్రొద్దుటూరు క్రైం : విద్యాసంస్థలకు వేసవి సెలవులు ఇచ్చారు. దీంతో చాలా మంది సొంతూళ్లకు, విహార యాత్రలకు వెళ్తుంటారు. అవసరాలు ఏవైనా సరే ఇళ్లకు తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చినప్పుడు తమకు సమాచారం ఇవ్వాల్సిందిగా ప్రొద్దుటూరు పోలీసులు కోరుతున్నారు. నాలుగైదు రోజులు తాళం వేసి వెళ్లడం వల్ల చోరీలు జరిగే అవకాశం ఉందని పోలీసులు అంటున్నారు. పోలీసుశాఖ అందుబాటులోకి తెచ్చిన ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను ఉపయోగించుకొని చోరీలు నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలని ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్ కోరుతున్నారు. ఊళ్లకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం ఇస్తే లాక్డ్‌హౌస్‌మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్) యాప్‌తో పని చేసే నిఘా కెమెరాను ఇంట్లో ఉంచుతామని వివరించారు. ఈ మేరకు శుక్రవారం ఏఎస్పీ మీడియాకు ప్రకటన విడుదల చేశారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌తో పని చేసే నిఘా కెమెరాలను ఇళ్లలో ఏర్పాటు చేయడం ద్వారా గతంలో ప్రొద్దుటూరుతో పాటు జిల్లాలో దొంగలను పట్టుకున్నామని పేర్కొన్నారు. ఇతర ఊళ్లకు వెళ్లే ఒక రోజు ముందు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇస్తే నిఘా కెమెరాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఊళ్లకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే వరకు కెమెరా ఉంచిన ఇళ్లు పూర్తిగా పోలీసు పర్యవేక్షణలో ఉంటుందని ఏఎస్పీ పేర్కొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

సిద్దవటం (ఒంటిమిట్ట): మండల కేంద్రమైన సిద్దవటంలో శుక్రవారం ఆకుల వీధి ప్రాంతంలో వాటర్ ట్యాంకు పరిసరాల్లో అపరిశుభ్రతపై జిల్లా మలేరియా నివారణ అధికారి మనోరమ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో ఈ విధంగా పారిశుధ్యం ఉండటంపై గ్రామ పంచాయతీ కార్యదర్శి ఓబులేసు ఆ ప్రాంతానికి పిలిపించారు. వెంటనే శుభ్రం చేయించాలని ఆదేశించారు. దోమల ద్వారా వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో వెంకట రెడ్డి, సీనియర్ ఆరోగ్య కార్యకర్త లక్షుమ్మ, ఆశా వర్కర్ విజయ భారతి, ఓబులేసమ్మ, పద్మజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే!



దేవుని కడపలో స్వామి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు (ఇన్‌సెట్) ఇరుదేవేరులతో కడపరాయుడు

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రవణానక్షత్రం సందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, అలంకారం చేసి ప్రత్యేక పీఠంపై కొలువుదీర్చారు. అనంతరం కల్యాణ క్రతువును నిర్వహించి అర్చకులు స్వామి పక్షాన అమ్మవారి గళసీమలో మహా మంగళ సూత్రాలను అలంకరించారు. భక్తులు విశేష సంఖ్యలో కల్యాణోత్సవానికి హాజరయ్యారు. కల్యాణం అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకీపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. కనుల పండువైన అలంకారంలో ఉన్న స్వామి, అమ్మవార్లను తిలకించిన భక్తులు పూజా ద్రవ్యాలు సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అర్చకులు వారికి మంగళ హారతులు ఇచ్చారు.

నాడు-నేడు పనుల తనిఖీ

సిద్దవటం (ఒంటిమిట్ట): మండల పరిధిలోని పొన్నవోలు, కొత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల, 11వ బెటాలియయన్ జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న రెండవ విడత నాడు–నేడు పనులను శుక్రవారం మండల విద్యా శాఖ అధికారి శంకరయ్య తనిఖీ చేశారు. ఎంఈవో మాట్లాడుతూ పొన్నవోలు, కొత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. వేసవి సెలవులు ముగిసే లోపు పనులు పూర్తి చేయాలన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

సిద్దవటం (ఒంటిమిట్ట): వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధి హామీ ఏపీఓ శైలజ తెలిపారు. ఉపాధి హామీ కార్యాలయంలో శుక్రవారం ఏపీఓ మాట్లాడుతూ...తాను కమలాపురం నుంచి బదిలీ అయ్యి సిద్దవటం ఏపీఓ గా బాధ్యతలు చేపట్టానన్నారు. ఉపాధి హామీ కూలీలు పనులకు వెళ్లేటప్పుడు వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని వేకువ జామునే వెళ్లి 10 గంటలకే పని ముగించుకోవాలని అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు చెప్పిన ప్రకారం చూపించిన ప్రదేశాలలో పనులు చేయాలని, వడదెబ్బ తగలకుండా మంచి నీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. అనారోగ్యంతో బాధ పడుతున్న వారు వేసవిని దృష్టిలో ఉంచుకుని పనులకు రావద్దని విజ్ఞప్తి చేశారు.

పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఆర్‌ఓ సత్యనారాయణ, అధికారులు

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లాను డెంగ్యూ, మలేరియా రహిత జిల్లాగా తీర్చి దిద్దుదామని డీఆర్‌వో సత్యనారాయణ అన్నారు. శుక్రవారం అన్నమయ్య జిల్లాలోని జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొండయ్య, జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ వేణుగోపాల్, ఇతర జిల్లా అధికారులతో కలసి సమావేశాన్ని నిర్వహించారు. పంచాయితీ, మత్స్య, మైన్స్, ఫారెస్టు, అధికారులతో పాటు వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు డెంగ్యూ, మలేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. అనంతరం డెంగ్యూ, మలేరియా నివారణ పోస్టర్లను విడుదల చేశారు.

రేషన్ షాపు తనిఖీ

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలో గల రేషన్ షాపు –2 ను శుక్రవారం విజిలెన్స్ అధికారి సీఐ రెడ్డప్ప తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ షాపులో నిలువ ఉన్న సరుకులను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఏఈ అశోక్, కానిస్టేబుల్ నాగేశ్వర రావు, ఆర్‌ఐ అనిత, వీఆర్‌వో ప్రభాకర్ రెడ్డి, డీలర్ పాల్గొన్నారు.

గాండ్లపల్లిలో ఘర్షణ

ఒంటిమిట్ట: మండల పరిధిలోని గాండ్లపల్లిలో శుక్రవారం ఘర్షణ చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు...గాండ్లపల్లిలో గల భద్రయ్య అనే వ్యక్తి, అతని సమీప బంధువైన మహిళతో స్థల వివాదంలో మాట మాటా పెరగడంతో ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పరస్పర దాడులు చేసుకోవడంతో ఇరువురికి గాయాలయ్యాయి. దీంతో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. దీనిపై ఏఎస్‌ఐ రాజు ను వివరణ కోరగా గాయపడిన వారు రిమ్స్‌కు వెళ్లడంతో అక్కడి నుండి ఇంకా వివరాలు అందలేదని తెలిపారు.

30 మందికి జరిమానా

నందలూరు (రాజంపేట): అతివేగం కేసులో 30 మందికి ఒకొక్కరికి రూ.300 చొప్పున జరిమానా విధిస్తూ నందలూరు జూనియర్ సివిల్ జడ్జి లత తీర్పు ఇచ్చారని నందలూరు ఏఎస్‌ఐ శంకర్‌నాయక్ తెలిపారు. శుక్రవారం ఇక్కడి విలేకర్లతో మాట్లాడుతూ అతివేగానికి శిక్ష తప్పదని హెచ్చరించారు.

ఇమామ్‌లకు గౌరవ వేతనం అందేలా కృషి


ఇమామ్‌ల జీతాల విషయమై వినతిపత్రాలు పరిశీలిస్తున్న చైర్మన్ నూర్ అహ్మద్

ఓబులవారిపల్లె: మండలంలో మసీదులలో పని చేసే మౌజన్లు, ఇమామ్‌లకు ప్రభుత్వం ద్వారా గౌరవ వేతనం అందేలా కృషి చేస్తామని జిల్లా వక్ఫ్ బోర్డ్ సెక్రటరీ నూర్ అహ్మద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని మైనార్టీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మౌజన్లు, ఇమామ్‌లు, మసీదులకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ సుంకేశుల రఫీ మాట్లాడుతూ మౌజన్లకు, ఇమామ్‌లకు జీతాలు విషయమై రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీ టీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డిల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. వారు వెంటనే స్పందించి వక్ఫ్ బోర్డ్ జిల్లా సెక్రటరీని ఆదేశించారని, ఇందులో భాగంగా మసీదుకు సంబంధించిన పత్రాలను సేకరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

మాతమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన


మాతమ్మ గుడి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ముక్కా వరలక్ష్మీ

ఓబులవారిపల్లె: మండలంలోని ముక్కవారిపల్లి దళితవాడలో మాతమ్మ ఆలయ నిర్మాణానికి శుక్రవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మీ ప్రత్యేక పూజలు నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముక్కా వరలక్ష్మీ మాట్లాడుతూ గ్రామస్తులు మాతమ్మ గుడి కట్టించాలని కోరగా వారి అభ్యర్థన మేరకు ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా దాదాపు రూ. 22 లక్షల వ్యయంతో ఆలయ నిర్మాణం చేపట్టనున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి ముక్కా సాయివికాష్ రెడ్డి, సర్పంచ్ అరవశ్రీధర్, సీనియర్ నాయకులు బత్తిన వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్‌సీపీ గెలుపును ఎవరూ ఆపలేరు

రాయచోటి : రాష్ట్రంలో ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలనను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయాన్ని రానున్న ఎన్నికలలో ఎవరూ ఆపలేరని వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు వెన్నపూస రవీంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం రాయచోటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో తనకు తోడుగా నిలిచిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో మొదటి ప్రాధాన్యత ఓట్లలో వైఎస్‌ఆర్‌సీపీ విజయం సాధించిందన్నారు. కేవలం రెండో ప్రాధాన్యత ఓటు విషయంలో కమ్యూనిస్టులు ఇతర పార్టీలు తోడవడంతోనే ప్రత్యర్థి పార్టీ అభ్యర్థి గెలిచారన్నారు.